క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



స్వామి వారికి చక్రస్నానం చేస్తున్న వేద పండితులు

కాళ్ల : మండలం కాళ్లకూరు గ్రామంలోని వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి నిత్యాపాసన, బలిహరణ, పంచసూక్త హవనం, మహా పూర్ణాహుతి, స్వామివారి పద్మావతి సరోవరంలో వసంతోత్సవం, పంచామృత అభిషేకం, చక్రస్నానం నీరాజన మంత్రపుష్ప ప్రసాద వినియోగం చేశారు. రాత్రి ధ్వజ అవరోహణ, చోరోత్సవం అనంతరం అశ్వవాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన చెన్నకేశవుని కల్యాణోత్సవాలు



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: మండలంలోని ఉప్పులూరులో చెన్నకేశవస్వామి కల్యాణోత్సవాల ముగింపు వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. చక్రతీర్థం, వసంతోత్సవాన్ని నిర్వహించిన అనంతరం ఆలయ ఆవరణలో చెన్నకేశవస్వామి సేవా సమితి, గ్రామ ప్రజల సహకారంతో అఖండ అన్నసమారాధనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పులూరు, ఉండి, కోలమూరు, పాములపర్రు, యండగండి, ఆరేడు, పాందువ్వ, కలిగొట్ల, ఉణుదుర్రు తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యర్రా వెంకటసుబ్బారావు, ఎంపీటీసీ నిమ్మల కేశవ్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో సిటీ బస్సులు నడపాలని వినతి



గిరిధర్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరం పట్టణంలో ఆర్టీసి సిటీ బస్సులను నడపాలని కోరుతూ ఆర్టీసి అధికారులకు శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యా వ్యాపార కేంద్రంగా ఎంతో ముందుంజలో భీమవరం ఉందని, జిల్లా కేంద్రం ఏర్పడిన సందర్భంలో ఆర్టీసీ 30 కిలో మీటర్ల దూరంలో పట్టణం మీదుగా బస్సులు నడపాలని కోరుతున్నామని అన్నారు. బార్ అసోసియేషన్ సభ్యుడు ఉండపల్లి రమేష్ నాయుడు, వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు మెరగని ఏడుకొండలు మాట్లాడుతూ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సిటీ బస్సులు ఏర్పాటు చేయాలని, ఆర్టీసి అధికారులు గుర్తించాలని కోరారు. అనంతరం ఆర్టీసి డిపో మేనేజర్ గిరిధర్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వై సురేష్, స్వచ్ఛంధ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీపీల రాష్ట్ర ఉపాధ్యక్షుడికి పీవీఎల్ అభినందనలు



ఎంపీపీల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీహరినారాయణరాజును అభినందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: రాష్ట్ర మండల పరిషత్ అధ్యక్షుల సంఘ ఉపాధ్యక్షుడుగా నియమితులైన ఉండి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు(హరిబాబు)ను శనివారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అభినందించారు.ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా తనను కలిసేందుకు వచ్చిన హరిబాబును సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ తనకు రాష్ట్రస్థాయిలో ఇంతటి బాధ్యత అప్పగించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, రణస్తుల మహంకాళి, రాష్ట్ర డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు,కాళ్ల ఎంపీపీ శీరీషవిశ్వనాధరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



తాడేరు గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పిస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తాడేరు గ్రామంలో రూ.17 లక్షల 50 వేలతో నిర్మించిన డా.వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు ఖరీదైన వైద్యం అందించాలనే ఉద్ధేశ్యంతో ఆరోగ్య శ్రీ ప్రవేశపెట్టి కార్పొరేట్ వైద్యం అందించారని గుర్తు చేశారు. ఆయన కుమారుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య శ్రీ ద్వారా సుమారు 3 వేల 200 వ్యాధులకు వైద్యం అందించడమే కాకుండా ఏ రాష్ట్రంలోనైనా కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యాన్ని పేదలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రతి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ఏర్పాటు చేయడమే కాకుండా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో వైద్య సిబ్బంది ప్రతి కుటుంబానికి తిరుగుతూ వ్యాధులను గుర్తించి ఉచితంగా వైద్యం అందిస్తున్నారన్నారు. కరోనా సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా పేషెంట్లను ఆరోగ్య శ్రీ చేర్చడమే కాకుండా వారికి కోవిడ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉచిత భోజనం, మందులు అందించి ఆ విపత్తు నుంచి రాష్ట్ర ప్రజలను కాపాడారన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లు ద్వారా బీపీ, షుగర్, రక్త పరీక్షలు తదితర 14 రకాల పరీక్షలు చేయడంతో వృద్ధులకు, వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు, బాలింతలకు ఎంతోగానో దోహదపడుతున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎమ్‌సీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు, తహసీల్దార్ వై. రవికుమార్, ఎంపీడీవో రామచంద్రప్రభు, పీహెచ్‌సీ వైద్యాధికారులు జి సుగుణరాజు, అరుణకుమారి, మండల యువత అధ్యక్షుడు నామన మహేష్, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, గూడపాటి పెద్దిరాజు, సమ్మలదీవి వినాయక్, బేతపూడి నాగేశ్వరరావు, పెంటపాటి నానాజీ, సర్పంచ్‌లు ఆరేటి పెద్దబ్బు, కోళ్ల బాలకృష్ణ, చిల్లే వెంకటేష్, నాగిడి నారాయణస్వామి, గంటా సుందర్ కుమార్, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, తిరుమాని ధనంజయరాజు, కొట్టి కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.

దానాల్లోకెల్లా అన్నదానం మహా పవిత్రమైనది



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): దానాలలో కెల్లా అన్నదానం చాలా పవిత్రమైనదని, గొప్పదని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రెండో పట్టణంలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ దంతులూరి జగన్నాధరాజు సత్రం అనుబంధ సంస్థ అయిన శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలను ఈనెల ఒకటో తేదీ నుంచి ఘనంగా నిర్వహించారని అన్నారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా స్వామివారికి అమ్మవార్లకు చందనాలంకరణ, అష్టోత్తర కలశాభిషేకం, స్వామివారి కల్యాణం, స్వామి వారికి రథోత్సవం, పుష్పయాగం, చక్రస్నానం, పుష్పోత్సవం, అఖండ అన్న సమారాధన కార్యక్రమాలను నిర్వహించిన ఆలయ పాలక మండలిని, అధికారులను అభినందిస్తున్నట్లు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు.

'పది' ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

భీమవరం అర్బన్ : పదవ తరగతి పరీక్షా ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ పరీక్షల్లో భీమవరం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. భీమవరం రూరల్ మండలంలో మొత్తం 953 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 680మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

కాళ్లలో 63 శాతం ఉత్తీర్ణత

కాళ్ల : విద్యాశాఖ ప్రకటించిన పది పరీక్షల ఫలితాలు కాళ్ల మండల పరిధిలో 63శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రవీంద్ర శనివారం తెలిపారు. మొత్తం 676 మంది పరీక్షలు రాయగా 399 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఉండి : పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో ఉండి శ్రీ ఇంగ్లీష్‌మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థులు అత్యధిక సంఖ్యలో విజయం సాధించారు. మండల వ్యాప్తంగా మొత్తం 507 మంది విద్యార్థులకు బాలికలు 252, బాలురు 255 మంది పరీక్ష రాయగా 143 మంది బాలురు,157 మంది బాలికలు మొత్తం 300 మంది ఉత్తీర్ణత సాధించారు.

సాక్షి, భీమవరం : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భీమవరం ఆదిత్య స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు శనివారం తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ టి శ్రీనివాస్, కేవీ సత్యనారాయణ, బి యుగసుధ, ఏవీఎల్ దుర్గాంబ తదితరులు అభినందించారు.

తిరుమల స్కూల్లో 99.68 శాతం ఉత్తీర్ణత....

భీమవరం పట్టణంలోని తిరుమల విద్యాసంస్థల్లోని పదవ తరగతి విద్యార్థులు 99.68 శాతం ఉత్తీర్ణత సాధించారని స్కూల్ డైరెక్టర్స్ ఎస్ సాయిరాజు, పి శ్రీనివాసవర్మ, జి సతీష్‌బాబు చెప్పారు. శనివారం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించిన సందర్భంగా విలేకర్లకు వివరాలను వెల్లడించారు.

పాలకోడేరు: పాలకోడేరు మండలంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో బాలికలదే పైచేయి సాధించి ఉత్తీర్ణులైనారు. మండలంలో 10 ప్రభుత్వ పాఠశాలలు, ఒక ఎయిడెడ్ పాఠశాల ఉండగా, రెండు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. మండలం మొత్తం 58.2 శాతం ఉత్తీర్ణత సాధించింది. మొత్తం 348 మంది బాలురు, 300 మంది బాలికలు ఉండగా 647 మంది పరీక్షలకు హాజరు కాగా, 378 మంది ఉత్తీర్ణత సాధించారు.

ఆకివీడు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చిన కాపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యధికంగా ఉత్తీర్ణ సాధించారు.

వీరవాసరంలో 50.8 ఉత్తీర్ణత

వీరవాసరం: పదవ తరగతి ఫలితాల్లో వీరవాసరం మండలంలో విద్యార్థులు 50.8 శాతం ఉత్తీర్ణత సాధించారు. 344 మంది బాలురకు గాను 153 మంది, 322 మంది బాలికలకు గాను 175 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ బొక్కా వినాయకుడు తెలిపారు. మొత్తంగా 666 మంది విద్యార్థులకు 328 ఉత్తీర్ణత సాధించారన్నారు. కొణితివాడ జెడ్పీ హెచ్ఎస్ 70.3 శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలిచింది.

ప్రారంభమైన పెంట్లమ్మ జాతర ఉత్సవాలు



పెంట్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద దర్శనాలు కోసం వేచియున్న భక్తులు



అమ్మవారి పూరిగుడి వద్ద ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

పెంటపాడు: మండలంలోని పెంట్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచే అమ్మవారి దర్శనాల కోసం భారీ సంఖ్యలో భక్తులు పూరిగుడి, మెట్టినిల్లైన సంగంమేడ ప్రాంతాల వద్ద ఉన్న ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు అమ్మవార్లకు సాంబ్రాణి, సారె, చీరె, పసుపు, కుంకుమ, వడపప్పు, పానకాలు పసుపు నీళ్ల కావిళ్లతో సమర్పించారు. ఆలయాల చుట్టు ప్రదక్షిణలు చేశారు. రాత్రి అమ్మవారి పాలిచేట గ్రామ వీధుల్లో తెల్లవారు వరకు తిప్పారు. ఈ సందర్భంగా ఆసాదుల నృత్యాలు, తీన్ మార్ డప్పులు, బాణసంచా కాల్పులు, గరగనృత్యాలు, కాళికా వేషదారణలతో గ్రామం రాత్రంతా మారుమ్రోగింది. ఉదయం ప్రతి వీధిలో కావిళ్ల ఊరేగింపులు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటి అధ్యక్షులు కొవ్వూరి లక్ష్మణరెడ్డి పర్యవేక్షణలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో పోలీసు బందోబస్తు భారీగా నిర్వహించారు. పూరి గుడి వద్ద అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం గ్రామంలో నైవేద్యాల కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. కాగా శుక్రవారం సాయంత్రం నుంచే గ్రామంలో జాతర సందడి నెలకొంది. ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి భక్తులు ఈజాతర ఉత్సవాలకు భారీగా హాజరయ్యారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోండి



వాండ్రంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు

ఉండి: రాష్ట్ర ప్రభుత్వ ప్రజారోగ్య పరిరక్షణకు చేపట్టిన ప్రతిష్టాత్మకమైన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రోగులందరూ వినియోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మహేశ్వరరావు అన్నారు.శనివారం ఉండి మండలం వాండ్రం గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కార్యక్రమం అమలు జరుగుతున్న తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్య సేవలు ఎలా అందుతున్నాయంటూ రోగులను ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు చేపట్టి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం చాలా గొప్పదన్నారు.ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేక ఎంతో మంది రోగాలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అటువంటి వారంతా ఈ కార్యక్రమంలో పరీక్షలు చేయించుకుని డాక్టర్ సలహాలతో మరింత మంచి వైద్యాన్ని పొందవచ్చునన్నారు. అలాగే దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు ఇక నుంచి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. స్వయంగా డాక్టర్ ఇంటికి వచ్చి రోగి పరిస్థితిపై ఆరా తీస్తారని అవసరాన్ని బట్టి చికిత్స అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ పీ ధర్మతేజ్ తదితర వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డీఎన్నార్ లా కళాశాలలో అవగాహన సదస్సు



భీమవరం డీఎన్నార్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న వెంకటరమణారావు

సాక్షి, భీమవరం: జాతీయ, రాష్ట్రీయ న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల ప్రకారం భీమవరం బార్ సోసియేషన్ ఆధ్వర్యంలో కేశవానంద భారతి, స్టేట్ ఆఫ్ కేరళ జడ్జిమెంట్ వచ్చి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మొగళ్ల వెంకటరమణారావు, పాకా రమేష్ బాబు మాట్లాడుతూ ఆస్తి హక్కు ప్రాథమిక హక్కుగా ఉండేదని ఈ హక్కును ప్రాథమిక హక్కుల నుంచి తొలగించడం జరిగిందని దీనిని పురస్కరించుకుని చారిత్రాత్మకమైన తీర్పును మననం చేసుకుంటూ దేశ వ్యాప్తంగా ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సీనియర్ న్యాయవాది జ్వాలా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ కేసులో రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు సంబంధించి ఇరుపక్షాల మధ్య చాలా హోరాహోరీ వాదనలు అనంతరం తీర్పు వెలువరించారన్నారు. అవగాహన సదస్సులో న్యాయవాదులు బంటుమిల్లి సురేష్, సుధీర్, కళాశాల అధ్యాపకులు భాస్కరరావు, చెల్లబోయిన రంగారావు, చిత్రబాను, అమూల్యరావు, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్ విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ పి. ప్రశాంతి



పాలకొల్లు మండలం దగ్గులూరు యానాదుపుంతలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి. ప్రశాంతి

పాలకొల్లు అర్బన్: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఏ విధమైన ఆందోళన చెందవద్దని కలెక్టర్ పి ప్రశాంతి హామీ ఇచ్చారు. పాలకొల్లు మండలంలోని దగ్గులూరు యానాదుపుంతలో ఉన్న ధాన్యం రాశులను శనివారం కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. అకాల వర్షం కారణంగా ధాన్యం తడవకుండా ప్రభుత్వం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆఫ్‌లైన్ విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్యం ఎత్తుకోవడానికి సంచుల కొరత లేకుండా టిప్పర్ల ద్వారా ధాన్యం రాశులను మిల్లులకు రవాణా చేయడానికి కలెక్టర్ ప్రశాంతి ఏర్పాట్లు చేశారు. దగ్గులూరు యానాదులపుంతలోని ధాన్యం రాశులను టిప్పర్ల ద్వారా మిల్లులకు రవాణా చేయించారు. లంకలకోడేరులోని శ్రీసాయి పవన్ మోడరన్ రైస్‌మిల్లును కలెక్టర్ ప్రశాంతి ఆకస్మిక తనిఖీ చేశారు. గతంలో దళారులు, మిల్లర్ల ప్రమేయంతో రైతులకు సరైన గిట్టుబాటు ధర లభించేది కాదన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో నూతన విధానం అమలు చేయడం వల్ల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ధాన్యం తూనికల యంత్రాలను ప్రతి 15రోజులకు ఒకసారి చెక్ చేయించుకోవాలన్నారు. మిల్లర్ల ద్వారా రైతులకు ఏమైనా సమస్యలు తలెత్తితే అధికారుల జోక్యం చేసుకుని పరిష్కరించాలన్నారు. ధాన్యం నిల్వ చేసుకోవడానికి అవసరమైన గోడౌన్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రైస్‌మిల్లుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా రైస్‌మిల్లర్లు వ్యవహరిస్తే ఆ రైస్‌మిల్లును సీజ్ చేయిస్తామని కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ వెంట భీమవరం ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, ఏవో షేక్ అబ్దుల్ రహీం, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు, మండల రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జద్దు గాంధీబాబు, రైతులు, వీఆర్వోలు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డులో అడ్డుగా వచ్చిన మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన అనంతరం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి నుజ్జునుజ్జు అయిన సంఘటన శనివారం జరిగింది. కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల్లో భవన నిర్మాణ పనుల నుండి ఇంటికి వెళ్లుతున్న అయిభీమవరం వాసి వర్మ వంతెన దిగుతుండగా చినకాపవరం నుండి మోడి వెళ్లుతున్న ఆటో అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో ఆటోలోని డ్రైవర్, ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. మోటారుసైకిలిస్టు వర్మకు గాయం అవ్వడంతో స్థానిక ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కే.రాజారెడ్డి చెప్పారు.

మహిళకు గాయాలు

ఆకివీడు: స్థానిక సిద్ధాపురం రోడ్డులో ధర్మాపురం వద్ద నడిచి వెళుతున్న మహిళను మోటారు సైకిలిస్టు ఢీకొట్టడంతో రోడ్డుపై మరో ప్రక్కకు పడటంతో లారీ వచ్చి ఢీకొట్టింది. సంఘటనలో ధర్మాపురం గ్రామానికి చెందిన మహిళ కాలుకు తీవ్రగాయమైంది. వెంటనే ఆమెను స్థానిక ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కే .రాజారెడ్డి చెప్పారు.

జగనన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

పెంటపాడు : మండలంలోని అన్ని గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు ప్రభుత్వ పథకాలైన హౌసింగ్ ద్వారా నిర్మిస్తున్న జగనన్న ఇళ్లను వేగవంతం చేసేలా అధికారులు కృషి చేయాలని డీపీవో, మండల హౌసింగ్ ప్రత్యేకాధికారి జీవీకే మల్లికార్జునరావు పేర్కొన్నారు. శనివారం మండల ప్రత్యేకాధికారిగా జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సమీక్షా నిర్వహించారు. అనంతరం పలు విషయాలు చర్చించారు.

ప్రజా ప్రతినిధులపై బీజేపీ చార్జిషీట్లు

సాక్షి, భీమవరం: అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీ అమలు, పరిపాలనలో వారి వైఫల్యాలపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని పోలీస్ స్టేషన్స్‌లో వారిపై చార్జిషీట్లు రూపంలో ఫిర్యాదుల ఉద్యమం చేపట్టనున్నట్లు బిజెపి రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర చైర్మన్ పాకా సత్యనారాయణ చెప్పారు. భీమవరంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కొంతకాలంగా అధికార పార్టీ పట్ల బిజెపి మెతక వైఖరి అవలంబిస్తుందనే ప్రచారం నిజం కాదన్నారు. అందువల్లనే వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, పాలనపై చార్జిషీట్ల రూపంలో వారిని ప్రజా కోర్టులోకి పిలవాలని బీజేపీపార్టీ నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమం శనివారం ప్రారంభమై 15 రోజులు పాటు సాగుతుందన్నారు. ఈ సమావేశంలో బిజేపీ నాయకులు కోమటి రవి కుమార్, అడబాల శివ, కాయిత సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారాన్ని వెంటనే విడుదల చేయాలి

ఉండి : మండలంలోని తడిసిన ధాన్యాన్ని, అలాగే పంట నష్ట పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఉండిలోని వరిచేలను, ధాన్యపు రాసులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులంతా రాబోయే రోజుల్లో అధిక వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందుకు ధాన్యాన్ని త్వరగా ఒబ్బిడి చేసుకోవాలంటూ సూచించారు. అలాగే రైతుల వద్ద నుంచి యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం సీతారాం తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి వేసవి విజ్ఞాన తరగతులు

ఉండి : ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉండి లైబ్రరీ నందు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి జేవీ కృష్ణమూర్తి తెలిపారు.ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించే తరగతుల్లో స్పోకెన్ ఇంగ్లీష్, జనరల్‌సైన్స్, మ్యాథ్స్, సోషల్ సబ్జెకులతో పాటు డ్రాయింగ్, ఆటపాటలు, యోగా తరగతులపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులంతా వినియోగించుకోవాలన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు అన్నివర్గాల ప్రజల మద్దతు

పోడూరు: రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల మద్దతు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఉందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా గన్నవరంలో శనివారం స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుతో కలిసి ఆయన నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నిప్రాంతాల ప్రజలు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పరిపాలనను స్వాగతిస్తున్నారన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

నరసాపురం రూరల్ : మొగల్తూరు మండలంలోని వారతిప్పలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం అందడంతో శనివారం మొగల్తూరు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 9 కోడి పుంజులు, 8 మోటారు సైకిళ్లు, ఒక కారు, రూ.1000 నగదును స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం వీరబాబు తెలిపారు.

గోదావరి గట్టుకు మరమ్మతులు చేపట్టాలి

పెనుగొండ: దొంగరావి పాలెం వద్ద వశిష్టా గోదావరి గట్టు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గోదావరి గట్టును సీపీఎం నాయకుల బృందం పరిశీలించింది. 31.500 నుంచి 31.675 మైలు వరకూ లంక గట్టు జారుతోందని వివరించారు. దీని వల్ల వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడే అవకాశాలున్నాయన్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరారు.సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, ఎస్ వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, రత్నరాజు, పాల్గొన్నారు.